Ugadi panchangam 2023-24_CONMAG 700 Real 11-03-2023 6:33 PM Page 46



# వస్తు ధరలు

**చైత్రం:** ఈ నెలలో నువ్వులు, పెసలు, కందులు, పూల ధరలు పెరుగుతాయి. నూలు, పత్తి ధరలు నెల మొదట్లో పెరిగి మధ్యలో తగ్గి, మాసాంతంలో మళ్లీ పెరుగుతాయి. బంగారం, వెండి ధరలు సామాన్యంగా ఉంటాయి. కూరగాయలు, నూనె, బెల్లం, ఇనుము, సిమెంట్, గృహనిర్మాణ సామగ్రి ధరలు నిలకడగా ఉంటాయి. ఆలుగడ్డ ఇతర దుంపల ధరలు తగ్గుతాయి.

**వైశాఖం:** నువ్వులు, కూరగాయలు, పండ్లు, పూలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కలప, పచ్చిమిర్చి, అరటి, కొబ్బరి, నూనె ధరలు పెరుగుతాయి. చక్కెర, బెల్లం ధరలు నిలకడగా ఉంటాయి. ఇనుము, సిమెంటు, గృహోపకరణాలు, కందులు, గోధుమలు, జొన్నల ధరలు స్థిరంగా ఉంటాయి.

**జ్యేష్ఠం:** బంగారం, వెండి ధరల్లో పెద్దగా వ్యత్యాసం ఉండదు. బియ్యం, పప్పుధాన్యాల ధరలు స్వల్పంగా తగ్గుతాయి. తమలపాకులు, పూలు, కూరగాయలు, నువ్వుల ధరలు అందుబాటులో ఉంటాయి. యంత్ర సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, స్టీలు, పత్తి, నూలు, ఇత్తడి, ధనియాలు, ఆవాలు, మిర్చి ధరలు పెరుగుతాయి.

**ఆషాఢం:** పుత్తడి, ఇత్తడి ధరలు కొంత తగ్గుతాయి. కూరగాయలు, పూల ధరలు అందుబాటులో ఉంటాయి. ధాన్యం, పత్తి, పప్పుధాన్యాలు, ఉలవలు, పెసర్లు, నూనెలు, కొబ్బరి, స్టీలు, బెల్లం ధరలు నిలకడగా ఉంటాయి.

**అధిక శ్రావణం:** ధాన్యం ధరలు తగ్గుతాయి. మిర్చి, పసుపు, కూరగాయలు ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరుగుతుంది. నువ్వులు, చింతపండు, ఆలుగడ్డ, అరటిపండ్లు, కొబ్బరికాయల ధరలు నిలకడగా ఉంటాయి. పాల ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి.

**నిజ శ్రావణం:** రెడీమేడ్ దుస్తుల ధరలు పెరుగుతాయి. బంగారం, వెండి ధరలు నిలకడగా ఉంటాయి. బెల్లం, ఉల్లిగడ్డలు, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, పూల ధరల్లో పెద్దగా వ్యత్యాసం ఉండదు.

**భాద్రపదం:** బంగారం, వెండి, చెరకు, వడ్లు, ఆవాలు, గోధుమలు, మినుములు, పెసర్లు, అరటి, పసుపు ధరలు పెరుగుతాయి. కొబ్బరికాయ, చింతపండు, చక్కెర, బెల్లం, రాగి, ఇత్తడి ధరలు తగ్గుతాయి. మిర్చి ధర స్థిరంగా ఉంటుంది.

**ఆశ్వయుజం:** నువ్వులు, శనగలు, గోధుమలు, వడ్ల ధరలు తగ్గుతాయి. బంగారం, వెండి, పసుపు, యంత్ర సామగ్రి, స్టీలు ధరలు పెరుగుతాయి. నూలు, పత్తి, బెల్లం, మిర్చి, చింతపండు, నూనె, ఆవాలు, మినుములు, పెసలు, ఉలవల ధరలు తగ్గుతాయి.

**కార్తికం:** ఎలక్ట్రిక్ వస్తువులు, కలప, వడ్లు, బంగారం, వెండి, ఇనుము, ఇత్తడి, రాగి ధరలు పెరుగుతాయి. పండ్లు, పూలు, పాలు, నెయ్యి, కూరగాయల ధరలు నిలిచి ఉంటాయి. అలంకార వస్తువులు, సుగంధ ద్రవ్యాల ధరలు తగ్గుతాయి.

**మార్గశిరం:** ధాన్యం ధరలు తగ్గుతాయి. పూలు, పండ్లు, కాగితం ధరలు పెరుగుతాయి. వైద్య ఉపకరణాలు, ఔషధాల ధరలు పెరుగుతాయి. మిర్చి, చింతపండు, బెల్లం, నెయ్యి, నూనె, ఇనుము, పట్టు దుస్తుల ధరలు స్థిరంగా ఉంటాయి.

**పుష్యం:** ధాన్యం ధర తగ్గుతుంది. బంగారం, నూలు దారం, పసుపు, అల్లం, మిర్చి, బెల్లం, చక్కెర, కూరగాయలు, పాలు, నెయ్యి, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాల ధరలు పెరుగుతాయి. కొబ్బరికాయల ధరలు స్థిరంగా ఉంటాయి.

**మాఘం:** బంగారం, కందులు, సిమెంటు, ఆవాలు, కొబ్బరికాయల ధరలు పెరుగుతాయి. గోధుమలు, వడ్లు, మిర్చి, మిరియాలు, చింతపండు ధరలు తగ్గుతాయి. రెడీమేడ్ దుస్తులు, పట్టు వస్త్రాలు, చక్కెర, కూరగాయల ధరలు నిలకడగా ఉంటాయి. పసుపు, పొగాకు, కందులు, అరటి ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి.

**ఫాల్గుణం:** బంగారం, నూలు, పట్టువస్త్రాలు, చక్కెర, బెల్లం, చింతపండు, పొగాకు, జొన్నల ధరలు పెరుగుతాయి. కందులు, మిర్చి, మిరియాలు, యంత్రసామగ్రి, సుగంధ ద్రవ్యాలు, నూనె, పాల ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉంటాయి.

## గ్రహణ నిర్ణయం

ఈ సంవత్సరం సూర్యగ్రహణాలు లేవు.

**పాక్షిక చంద్ర గ్రహణం (28-10-2023)**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఆశ్వయుజ పౌర్ణమి శనివారం 28-10-2023 రాత్రి 1-06 గంటల నుంచి రాత్రి 2-22 గంటల వరకు రాహుగ్రస్త పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడుతున్నది. ఇది అశ్విని నక్షత్రం, సింహ లగ్నంలో సంభవిస్తున్నది. ఈ పాక్షిక చంద్ర గ్రహణం దేశంలోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. గ్రహణం కృష్ణ వర్ణంలో దర్శనమిస్తుంది. అశ్విని, మేష రాశుల వారు గ్రహణం చూడకూడదు. దక్షిణ ఆగ్నేయ సమీపంలో గ్రహణ స్పర్శ. దక్షిణ సమీపంలో గ్రహణమోక్షం. రాత్రి భోజనం పనికిరాదు. శనివారం సూర్యాస్తమయం లోపే భోజనాదులు ముగించుకోవాలి. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు రాత్రి 10 గంటల లోపు భోజనాలు చేయవచ్చు.

స్పర్శ కాలం: రాత్రి 1-06, మధ్యకాలం: రాత్రి 1-44

మోక్షకాలం: రాత్రి 2-02, మొత్తం గ్రహణ సమయం: 1-17 గంటలు

గ్రహణ గోచారం:

కుంభం-వృశ్చికం-కర్కాటకం-మిథునం రాశులవారికి శుభప్రదం

మీనం-ధనుస్సు-తుల-సింహం రాశులవారికి మధ్యమం

మేషం-మకరం-కన్య-వృషభం రాశులవారికి అధమం

## మకర సంక్రాంతి (15-1-2024)

స్వస్తి శ్రీ శోభకృత్ నామ సంవత్సరం పుష్య మాసం శుక్ల తదియ ఉపరి చవితి తేది 14-1-2024 ఆదివారం రాత్రి 2-43 గంటలకు తెల్లవారితే సోమవారం అనగా శతభిషం నక్షత్రం మూడోపాదం, వ్యతీపాత యోగం, భద్ర కరణం, వృశ్చిక లగ్నంలో రవి మకరరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. 'రాత్రేవ స్నానదాన పరేహణి' అను ప్రామాణిక వచనం అనుసారం మర్నాడు జనవరి 15న సంక్రాంతి పండుగ చేసుకోవాలి. సంక్రాంతి పుణ్యకాలం సోమవారం సూర్యోదయం (6-49) నుంచి సూర్యాస్తమయం (6-01) వరకు ఉన్నది.

**మకర సంక్రాంతి పురుష లక్షణం**

సంక్రాంతి పురుషుడి పేరు ధ్వాంక్ష కావడం వల్ల వ్యాపారులకు అరిష్టం. చందనోదక స్నానఫలం- అనుకూల వర్షాలు, సుభిక్షం, ప్రజారోగ్యం. ముద్రాక్షత ధారణ ఫలం- పెసర పంటలకు నష్టం. చర్మ వస్త్రధారణ- భయం. ఖడ్గ ధారణం- యుద్ధ వాతావరణం. సిందూరగంధ లేపనం- సాధుజనులకు అరిష్టం. కాంస్య పాత్ర భోజనం-అరిష్టం. పాయసాహారం- ప్రజాక్షయం. బిల్వఫల భక్షణం- అతివృష్టి. అశ్వ వాహనం- గుర్రాలకు హాని. చింతతో కూడిన ముఖం- ప్రజాసౌఖ్యం. మయూర పింఛ ఛత్రం- చిత్రలేఖకులకు అరిష్టం. నివిష్ట చేష్టా ఫలం- సస్యవృద్ధి. ఈశాన్య దిక్కు ప్రయాణించడం- ఈశాన్య ప్రాంతాలకు అరిష్టం. శుక్ల పక్షం- వ్యాధి భయం, యుద్ధ వాతావరణం. చవితి- మిశ్రమ ఫలితాలు. సోమవారం- సుభిక్ష క్షేమారోగ్యం. శతభిషం నక్షత్రం- సువృష్టి. రాత్రి సమయం- సస్యాభివృద్ధి. వృశ్చిక లగ్నం - రాజులకు అరిష్టం. ముహూర్త ఫలం- సుభిక్షం.